క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : వేమనరెడ్డి కాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మార్పు చేస్తున్న ప్రక్రియలో భాగంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

◆ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సురక్ష ఎన్‌క్లేవ్, భిక్షపతి ఎన్‌క్లేవ్ ఫీడర్ల పరిధిలో విద్యానగర్, సురక్ష ఎన్‌క్లేవ్, సత్య ఎన్‌క్లేవ్, రాజేంద్రరెడ్డి కాలనీ, కైలాష్‌నగర్, జవహర్ కాలనీ, ఓల్డ్ బాంబే రోడ్డు ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

◆ మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కెఎస్ఆర్, ఓల్డ్ బాంబే ఫీడర్ల పరిధిలో కెఎస్ఆర్, అపర్ణ, పీజేఆర్ రోడ్డు నెం .2,4,8,9,12, జవహర్ కాలనీ, శంకర్‌నగర్, బీహెచ్ఈఎల్ మెయిన్ రోడ్డు ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రెజ్లర్ల సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

రాయదుర్గం: రాజేంద్రనగర్ కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి నరేందర్‌ను రంగారెడ్డిజిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం కలిశారు. రాయదుర్గానికి చెందిన అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్యామ్లెట్ పాండు ఆధ్వర్యంలో రాయదుర్గం, మణికొండ, జిల్లాలలోని వివిధ ప్రాంతాలకు చెందిన రెజ్లింగ్ సభ్యులు, రెజ్లర్లు కలిసి ఆయనను సన్మానించారు. అనంతరం రెజ్లర్ల సమస్యలను వివరించి పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో రెజ్లింగ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఫిలింనగర్ బస్తీల్లో 'హలో మాల చలో బస్తీ బాట'

ఫిలింనగర్: తెలంగాణ రాష్ట్ర మాల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం హలో మాల చలో బస్తీ బాట కార్యక్రమం ఫిలింనగర్ బస్తీల్లో నిర్వహించారు. ఫిలింనగర్‌లోని బాబూ జగ్జీవన్ రామ్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పోరాట సమితి చైర్మన్ జి. చెన్నయ్య ఆధ్వర్యంలో ప్రతినిధులు పూల మాలలు వేసి ర్యాలీగా బస్తీల్లోకి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. మాలలను అణిచివేసే ధోరణితో ఎస్సీ వర్గీకరణ చేస్తున్నామని అంటున్న రాజకీయ పార్టీల వైఖరిని సమితి తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత అత్యధిక జనాభా కలిగిన మాలలకు ప్రభుత్వ పథకాల్లోనూ, రాజకీయంగానూ తీరని అన్యాయం జరుగుతుందని ఈ అన్యాయాలపై మాల సామాజిక వర్గాలను చైతన్యం చేసేందుకు బస్తీబాట చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఎస్సీ వర్గీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న మాల సామాజికవర్గం ఉషా మెహెరా కమిషన్‌కు తెలంగాణ రాష్ట్రానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఎస్సీ కుల జనాభా లెక్కలపై రాష్ట్రంలో సర్వే నిర్వహించాలన్నారు. ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. మొత్తం 20 డిమాండ్లతో ఈ బాట కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

'స్పినా బిఫిడా ఫౌండేషన్' ప్రారంభం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని అంకుర హాస్పిటల్స్ సహకారంతో స్పినా బిఫిడా ఫౌండేషన్ తెలంగాణ చాప్టర్‌ను ఆదివారం గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ ప్రారంభించారు. కార్యక్రమంలో స్పినా బిఫిడా ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ సంతోష్ జె కమలాకర్, అంకురా హాస్పిటల్స్ ఎండీ కృష్ణప్రసాద్, డాక్టర్ వీవీఎస్ చంద్రశేఖరమ్ పాల్గొన్నారు.

ఇక్కడ ఉన్న వారందరూ తెలంగాణ బిడ్డలే..

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- భవిష్యత్‌లో కల్వరి టెంపుల్ నుంచి హైటెక్ సిటీ వరకు మరో ఫ్లైఓవర్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు. చిత్రంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని వసంత నగర్ కాలనీలో ఆదివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎన్నికలు జరిగిన ప్రతిసారి పారాచూట్ నాయకులు దిగుతున్నారన్నారు. అలాంటి వారికి నియోజకవర్గంపై ఎలాంటి అవగాహన ఉండదన్నారు. అలాంటి వారు ప్రజలకు ఏమి చేస్తారన్నారు.

◆ కేపీహెచ్‌బీ డివిజన్‌లో ప్రతి గల్లీలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు అందరూ తెలంగాణ బిడ్డలే, సెటిలర్స్ అన్న పదం వాడొద్దన్నారు. ఈ పదేళ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకున్నాం.. ఇంకా చేయాల్సింది చాలా ఉందన్నారు. భవిష్యత్‌లో కల్వరి టెంపుల్ నుంచి హైటెక్ సిటీ వరకు మరో ఫ్లైఓవర్ రాబోతున్నదన్నారు.

◆ ప్రతి ఇంటికి మంచినీరు, సీసీ రోడ్లు, ఓపెన్‌జిమ్‌లు, పార్కులు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయటంతో కేపీహెచ్‌బీ డివిజన్ రూపురేఖలే మారాయన్నారు. కులాలు మతాలు మధ్య చిచ్చు పెట్టే బీజేపీ పార్టీని, ఓట్లు కోసం నాయకులు కొట్టుకునే కాంగ్రెస్ పార్టీని తరిమి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.



కేపీహెచ్‌బీ డివిజన్ వసంత్‌నగర్‌లో నిర్వహించిన సభలో పాల్గొన్న ప్రజలు

◆ అదే విధంగా వసంత్ నగర్‌లో ఎన్టీఆర్ విగ్రహం, టెంపుల్ బస్‌స్టాప్ వద్ద రాజశేఖర్‌రెడ్డి, వంగవీటి రంగా విగ్రహాలను ఏర్పాటు చేసి అందరూ మన వాళ్లే అని ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవిస్తున్నామని తెలిపారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాన్ని వేరే పార్టీలకు అప్పజెప్పకుండా... కులాలు, మతాల ఓట్లు.. సీట్లు అంటూ గొడవలు తెచ్చుకోకుండా ప్రశాంతంగా ఉందామన్నారు.



కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మాధవరం కాంతారావు

'బీసీ ముఖ్యమంత్రి నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు'

కూకట్‌పల్లి: బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సూర్యాపేట బీజేపీ బహిరంగ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా తాము తెలంగాణలో అధికారంలోకి వస్తే వందకు వంద శాతం బీసీ అభ్యర్థినే ముఖ్యమంత్రి చేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాష్ట్ర ఓబీసీ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యాలయం వద్ద ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలియజేస్తూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు పాల్గొని ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

◆ ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బీసీ అభ్యర్థిని ప్రకటించినందుకు కేంద్రమంత్రి అమిత్ షాకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. దేశంలో బడుగు, బలహీన వర్గాల కోసం అహర్నిశలు కష్టపడుతున్న పార్టీ ఏదైనా ఉందా అంటే అది ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో నడిచే బీజేపీ మాత్రమే అని కొనియాడారు. బీజేపీ బీసీ నిర్ణయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ స్వాగతిస్తూ తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, శ్రీకర్‌రావు, మహేష్, నాగరాజు శాస్త్రి, సాయికుమార్, శంకర్‌రెడ్డి, ఈశ్వర్, రామకృష్ణ, కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

జంగ్ 2023 తెలంగాణ

బీసీ ముఖ్యమంత్రి ప్రకటనపై సర్వత్రా హర్షం

భాగ్యనగర్‌కాలనీ: తెలంగాణ ప్రజలు బీజేపీని గెలిపిస్తే బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆదివారం శేరిలింగంపల్లి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి గోవింద్ హోటల్ చౌరస్తాలో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేషయ్య, ఎత్తరి రమేష్, వీరమల్ల కేశవరావు, శ్రీహరి యాదవ్, నర్సింగరావు, నరసింహాచారి, సీతారామ రాజు, బాలకృష్ణ, తిమ్మయ్య, మురళి, నవీన్‌గౌడ్, నర్సింగరావు, కమలాకర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మనోజ్‌కుమార్, కృష్ణంరాజు, సాయి, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి డివిజన్‌లో కార్పొరేటర్ ప్రచారం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని మైత్రీ నగర్, విజ్ఞాన్‌పురికాలనీ, బలరాంనగర్, సాయినగర్‌లలో స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఆదివారం ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కృష్ణారావు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసుదేవరావు, సంతోష్, ప్రభాకర్, బొట్టు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి చేసి చూపిస్తున్నందుకే బీఆర్ఎస్‌లోకి చేరుతున్నాం'



కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారితో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ఫతేనగర్ డివిజన్‌లో బీజేపీకి చెందిన పలువురు నాయకులు, వారి అనుచరులు సుమారు 20మంది ఆదివారం ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తరువాత కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. రాజకీయాలకు అతీతంగా అందుతున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే కృష్ణారావు చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరామన్నారు. గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి చేసి చూపించిన ఎమ్మెల్యే కృష్ణారావుకు తోడుగా నిలబడేందుకు బీఆర్ఎస్‌లో చేరామని తెలిపారు.

◆ **పార్టీలో చేరిన ఒరిస్సాకు చెందిన 50 మంది**

అదే విధంగా బీఆర్ఎస్ పార్టీ నాయకుడు నందు ఆధ్వర్యంలో 50 మంది ఒరిస్సాకు చెందిన కుటుంబాలు ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నందు మాట్లాడుతూ.. స్థానికేతరులమైన ఒరిస్సా వాసులను ఆదరించిన ఘనత సీఎం కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. స్థానికేతరులు అనే వ్యత్యాసం చూపకుండా సోదర భావంతో ఆదరించి వారికి కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించిన ఘనత సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులకే దక్కుతుందన్నారు. ఇంత బాగా ఆదరించిన బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును భారీ మెజార్టీతో గెలిపించుకొని హ్యాట్రిక్ విజయం అదిస్తామని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో జనార్దన్‌గౌడ్, రాకేష్ ఖన్నా, కిరణ్, మారుతీ, ఫణి, రతన్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

◆ **బీఆర్ఎస్ గూటికి కాంగ్రెస్ నాయకులు**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 200 మంది నాయకులు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీని నమ్ముకున్న వారికి, స్థానికంగా ఉన్న కాంగ్రెస్ నాయకులకు టికెట్ ఇవ్వకుండా బయట వారికి టికెట్ ఇవ్వటం బాధాకరమన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధి ప్రజలకు అందిస్తున్న సంక్షేమపథకాలకు ఆకర్షితులమై బీఆర్ఎస్‌లో చేరుతున్నామని కాంగ్రెస్ నాయకుడు శివ పేర్కొన్నాడు. అందరికి అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించే నాయకుడు మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, మహమ్మద్ గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏమ్మా.. పోలీస్‌స్టేషన్ వచ్చాక ఎలా ఉంది..?

మహిళను ప్రశ్నించిన డీసీపీ జోయల్ డేవిస్

ఫిలింనగర్: ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి కట్టడి ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్ జూబ్లీహిల్స్ ఏసీపీ కట్ట హరిప్రసాద్, ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు, 12 మంది ఎస్ఐలు కలిసి 120 మంది సిబ్బందితో జరిగిన ఈ కార్డన్ అండ్ సర్చ్‌లో ప్రతి ఇంటికీ వెళ్లి వారిని ప్రశ్నిస్తూ అనుమానిత వాహనాలను తనిఖీ చేశారు. కొత్తగా పోలీస్‌స్టేషన్ వచ్చిన తర్వాత ఎలా ఉందని మహిళలను ప్రశ్నించారు.గంజాయి తాగి ఎవరైనా న్యూసెన్స్ చేస్తున్నారా అని ప్రశ్నించారు. పోలీసుల పనితీరు బాగుందా అని వాకబు చేశారు. ఏ ఇబ్బంది లేదా అని తెలుసుకున్నారు.

హ్యాపీ హైదరాబాద్

కూకట్‌పలి: కూకట్‌పల్లి ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హ్యాపీ హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి హైదరాబాద్‌లో నివసిస్తున్న వారు వారి అభిప్రాయాలను పంచుకున్నారు. గతంలో హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత హైదరాబాద్ ఏ విధంగా ఉంది అనే దాని గురించి సభ్యులు చర్చించారు. నేడు హైదరాబాద్ శాంతి భద్రతల విషయంలో కానీ, మౌలిక సదుపాయాల కల్పనలో అన్ని విధాలుగా సురక్షితంగా ఉందని సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. నగరాన్ని ఈ విధంగా కనొసాగించడానికి నాయకులు తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వ్యాపారస్తులు, గృహిణులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



నగదు, మద్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం భానూర్ బీడీఎల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో పోలీసులు నగదు పట్టుకున్నారు. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎన్నికల నిబంధనల్లో భాగంగా బీడీఎల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో కారులో తరలిస్తున్న రూ.లక్షను కనుగొన్నారు. ఈ నగదుకు ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అందజేశారు. అదేవిధంగా పటాన్‌చెరు మండలం నందిగామలో మహేష్ కిరణా షాపులో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నానని విశ్వసనీయ సమాచారం రావడంతో దాడులు నిర్వహించి రూ.8 వేలు విలువచేసే మద్యం సీజ్ చేశారు.

సినీ అండ్ టీవీ జూనియన్ ఆర్టిస్ట్స్ యూనియన్ కార్యవర్గం

బంజారాహిల్స్: తెలుగు సినీ అండ్ టీవీ జూనియన్ ఆర్టిస్ట్స్ యూనియన్ కార్యవర్గ ఎన్నికలు ఆదివారం ఫిలింఛాంబర్‌లో జరిగాయి. అధ్యక్షుడిగా డి.స్వామిగౌడ్, కార్యదర్శిగా వల్లభనేని అనిల్‌కుమార్, కోశాధికారిగా శివకుమార్ విజయం సాధించారు. అనంతరం విజయోత్సవాలు నిర్వహించారు.

సూట్ కేసులతో రాజకీయాల్లోకి రాలేదు

కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు టికెట్ ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీకి ధన్యవాదాలు తెలుపుతున్నానని బండి రమేష్ అన్నారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కూకట్‌పల్లి మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు కాంగ్రెస్ పార్టీని వీడి వెళ్తారని అనుకోవడం లేదన్నారు. ఆయన బాధ, ఆవేదన తెలిసిన వ్యక్తిని అని తెలిపారు. సూట్ కేసులతో రాజకీయాల్లోకి రాలేదని... ప్రజల కోసం పనిచేశానన్నారు. కేసీఆర్ అడుగు జాడల్లో ఏ పని అప్పజెప్పినా చేశానని, ఇన్నాళ్లు పార్టీకి సేవ చేసి ప్రజలకు సేవ చేయడానికి వచ్చానన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ వచ్చినప్పుడు మొట్టమొదటి మాట తప్పారన్నారు. తెలంగాణ ఇచ్చాక కాంగ్రెస్‌లో విలీనం అన్నారని.. దళిత ముఖ్యమంత్రి అన్నారని ఏదీ చేయలేదన్నారు. గతంలో రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే ఫ్లై ఓవర్లు కట్టారన్నారు. పైపైనే మెరుగులు దిద్దటం అభివృద్ధి కాదన్నారు.

◆ డ్యాములు కట్టింది కూడా కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం గడీల మధ్య బంది అయ్యిందన్నారు. ఒక హోంమంత్రి గేటు లోపలకు వెళ్లాలంటే అనుమతి ఉండదన్నారు. ఉద్యమకారులను పట్టించుకోని ఈ ప్రభుత్వం జర్నలిస్టులకి ఇళ్ల స్థలాలు అని మోసం చేసిందని పేర్కొన్నారు. చెరువులు ఎలా కుచించుకుపోయాయో తెలుసన్నారు. కూకట్‌పల్లికి తానేమి కొత్తకాదని పీజేఆర్ తనకు రోల్ మోడల్ అని పేర్కొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బండి రమేష్

బీజేపీ జిల్లా కార్యదర్శిగా పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్



మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీజేపీ గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పని చేయాలని బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో శ్రీవివేకానందనగర్‌కు చెందిన పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్‌కు జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాబోయే సాధారణ ఎన్నికల్లో బీజేపీ తెలంగాణ రాష్ట్రంలో కాషాయం జెండా ఎగరవేయటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి బీసీ అభ్యర్థిని ప్రకటించటం బీజేపీకే దక్కిందన్నారు. ప్రతి కార్యకర్త దేశం గర్వించే విధంగా పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. తాను కార్యకర్తగా పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా కార్యదర్శిగా నియమించినందుకు జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

కాంగ్రెస్ తొత్తులుగా టీటీడీపీ నేతలు

- టికెట్ రాలేదని అలక ప్రదర్శిస్తున్న స్థానిక కాంగ్రెస్ నేతలు
- అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న తెలుగుదేశం నాయకులు

కూకట్‌పల్లి: తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పోటీ చేయకపోవటంతో తెలుగుదేశం నాయకులు పొత్తులు లేవని అధిష్ఠానం తేల్చటంతో తెలుగుదేశం నాయకులు కాంగ్రెస్ పార్టీ జెండా లేకుండా తొత్తులుగా పనిచేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ జెండా మోయకుండా కాంగ్రెస్ పార్టీ కోసం సర్వవిధాలుగా సహాయ పడుతున్నారు. అసలు కాంగ్రెస్ నాయకులు తమ స్థానిక నాయకులకు టికెట్ రాలేదని అలిగి కూర్చోగా టీడీపీ నాయకులే ఆ బాధ్యతలు మీదేసుకొని పనిచేస్తున్నారు.

◆ కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని వసంత్‌నగర్‌లో ఓ తెలుగుదేశం నాయకుడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభించి అక్కడ జరగాల్సిన కార్యక్రమాలన్నిటిని దగ్గరుండి చూసుకోవటం దీనికి నిదర్శనం. ఈ సందర్భంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ జెండా వేసుకొని పనిచేయాలని సూచించటంతో ఇరువురి మధ్య వాదోపవాదాలు జరిగాయి.

◆ నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో అసలు కాంగ్రెస్ నాయకులే కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనటం లేదు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు ఒక భాగం ఉంటే మూడు భాగాలు మీడియా మిత్రులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు.

◆ పైపైకి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవడానికి మేమందరం సహకరిస్తామని చెప్పినప్పటికి కష్టపడి జెండాలో మోసే కార్యకర్తలకు ఈ నియోజకవర్గంలో ఎప్పుడు కొత్తవారితోనే ఎన్నికల ముందు కొట్లాట అవుతుందని కార్యకర్తల పట్ల ఏ ఒక్కరూ సానుకూలం చూపించకుండా కేవలం నాయకులకు ప్యాకేజీలను అప్పగించి పోతున్నారని అక్కడి కార్యకర్తలు వాపోయారు.

◆ కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్ మీడియా సమావేశంలో మాట్లాడిన తీరును ఓ కార్యకర్త తీవ్రంగా వ్యతిరేకిస్తూ 1999లో, 2004లో పీజేఆర్‌ని ఓడించటానికి కారణమైన వారు పీజేఆర్‌ను రోల్‌మోడల్‌గా చెప్పుకోవటం సిగ్గు చేటని తీవ్ర స్థాయిలో ఖండించాడు.

◆ 2009లో పీఆర్‌పీ, 2014లో టీడీపీ 2018లో టీఆర్ఎస్, 2023లో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్న బండి రమేష్‌పై చాలా మంది కార్యకర్తలు ధ్వజమెత్తుతున్నారు. అయినప్పటికీ బండి రమేష్ మాత్రం తాను కాంగ్రెస్ పార్టీలో హృదయపూర్వకంగా చేరినట్లు తెలిపారు. కార్యకర్తల కష్టసుఖాల్లో తాను ముందుండి నియోజకవర్గంలో పార్టీ గెలుపుకు కార్యకర్తలు పనిచేయాలని తెలిపారు.

◆ ఈ సందర్భంగా నిరుత్సాహానికి గురైన కార్యకర్తలను కూడా ఓదారుస్తూ బండి రమేష్ ఆదివారం జరిగిన కార్యక్రమాన్ని నడిపించారు. ఇదిలా ఉండగా బండి రమేష్‌కు కాంగ్రెస్ పార్టీలో కొత్తగా రావటంతో ఎన్నికలయ్యేంత వరకూ ప్రచార యాత్ర కంటే ఓదార్పు యాత్రే ఎక్కువవుతుందని కొంతమంది భావిస్తున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రం బండి రమేష్ పట్ల సంపూర్ణంగా ప్రచారం చేస్తారా.? అనేది వేచి చూడాల్సి ఉంది. అయితే మరోవైపు తెలుగుదేశం కార్యకర్తలు తమ అభ్యర్థే అన్న చందంగా దూకుడుతో పనిచేస్తున్నారు. అయితే కాంగ్రెస్ కార్యకర్తలకు ఇది మింగుడు పడటం లేదు. కాంగ్రెస్ పార్టీ టికెట్ మీద పోటీ చేసిన బండి రమేష్ మాత్రం ఇరువర్గాలను ఎలా సమన్వయం చేస్తారో అనేది కోటి ప్రశ్నలకు సమాధానంగా మారింది.

కారు గుర్తుకే ఓటేద్దాం... బీఆర్ఎస్‌ను గెలిపిద్దాం

ఎమ్మెల్యే గాంధీ సతీమణి శ్యామలదేవి

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని మిత్రనగర్ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఇంటింటి ప్రచారంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సతీమణి శ్యామలా దేవి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళా పక్షపాతి అని మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఆసరా ఫింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఒంటరి మహిళలకు ఫింఛన్లు, కేసీఆర్ బీమా ప్రతి ఇంటికి ధీమా వంటి అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. అర్హులైన పేదలకు ప్రతి నెలా 3వేల రూపాయల జీవన భృతి అందించం గొప్ప విషయన్నారు. అదే విధంగా మంత్రి కేటీఆర్ సహకారంతో ఎమ్మెల్యేఅరెకపూడి గాంధీ అభివృద్ధి, సంక్షేమం నినాదంతో 9 వేల కోట్ల రూపాయల నిధులతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలోని పేదలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీకి శ్రీరామరక్ష అన్నారు. ఈ తొమ్మిది ఏళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి ఓట్లు అడుగుతున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే గాంధీ భారీ మెజార్టీతో విజయం సాధించటం కాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గాంధీకి ఓటు వేయాలని అభ్యర్థిస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న శ్యామలా దేవి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని కలిసికట్టుగా గెలిపించుకోవాలి : కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉజ్జయిని మహాంకాళినగర్ అసోసియేషన్ సభ్యులు, దత్తాత్రేయ కాలనీ అసోసియేషన్ సభ్యులు, బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో ఆదివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఎన్నికల కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీకి మూడోసారి ఓటు వేసి గెలిపించుకోవడానికి మనందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. పోలింగ్ బూత్‌లలో ఇన్‌చార్జ్‌లను నియమించే బాధ్యత కూడామనమే తీసుకొని ప్రతి బూత్‌లోనూ పదిమంది ఇన్‌చార్జ్‌లను నియమించాలన్నారు. బీఆర్ఎస్ కోసం ఇప్పటి వరకు మీరందరు ఎంతో కష్టపడ్డారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించే బాధ్యత కార్యకర్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు కాశీనాద్ యాదవ్, మాజీ అధ్యక్షుడు పాండుగౌడ్, ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అరెకపూడి గాంధీని గెలిపించుకుంటాం: సాయినగర్ వెస్ట్ కాలనీ

ఆల్విన్‌కాలనీ సాయినగర్ వెస్ట్ కాలనీ సభ్యులు ఆదివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సాయినగర్‌లో జరిగిన అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యే గాంధీకి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు.